యువ భారత్ శుభారంభం

- అండర్-19 ఆసియా కప్

దుబాయ్: పురుషుల అండర్-19 ఆసియా కప్‌లో భారత క్రికెట్ జట్టు బోణీ కొట్టింది. టోర్నీ తొలి పోరులో శుక్రవారం యంగ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో అఫ్గానిస్థాన్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. జంషెద్ జద్రాన్ (43) టాప్ స్కోరర్ కాగా.. మన బౌలర్లలో అర్షిన్ కుల్‌కర్ణి, రాజ్ లింబాని చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 37.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. ఓపెనర్ అర్షిన్ (70 నాటౌట్) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా.. ముషీర్ ఖాన్ (48 నాటౌట్) రాణించాడు. టోర్నీలో భాగంగా ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

పంజాబ్ క్రికెట్ హెడ్‌గా బంగర్

చండీగఢ్: టీమ్‌ఇండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్.. పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ హెడ్ ఆఫ్ క్రికెట్‌గా ఎంపికయ్యాడు. గతంలో పంజాబ్‌కు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించిన సంజయ్.. దాదాపు పదేండ్ల తర్వాత తిరిగి పంజాబ్‌తో కలిసి పనిచేయనున్నాడు. 'మరోసారి పంజాబ్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. కింగ్స్‌తో కలిసి పనిచేసేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా. మంచి నైపుణ్యం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. వారికి అవసరమైన సలహాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా' అని బంగర్ ఒక ప్రకటనలో తెలిపాడు. ప్రస్తుతం పంజాబ్ జట్టుకు ట్రావర్ బేలీస్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తుండగా.. గత రెండు సీజన్లలోనూ పంజాబ్ ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది.

ఫిలిప్స్ పోరాటం

- న్యూజిలాండ్ 180 ఆలౌట్
- బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు

మీర్‌పూర్: గ్లెన్ ఫిలిప్స్ (72 బంతుల్లో 87; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేయడంతో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ కోలుకుంది. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకు ఆలౌట్ కాగా.. ఓవర్‌నైట్ స్కోరు 55/5తో శుక్రవారం మూడో రోజు ఆట కొనసాగించిన న్యూజిలాండ్ 180 పరుగులకు ఆలౌటైంది. లాథమ్ (4), కాన్వే (11), విలియమ్సన్ (13), నికోల్స్ (1), మిషెల్ (18), బ్లుండెల్ (0), శాంట్నర్ (1) విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో మెహదీ, తైజుల్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా 2 వికెట్ల నష్టానికి 38 పరుగులు చేసింది. చేతిలో 8 వికెట్లు ఉన్న బంగ్లా.. ఓవరాల్‌గా 30 పరుగుల ఆధిక్యంలో ఉంది.

వరల్డ్‌కప్ ఫైనల్ పిచ్ యావరేజ్

న్యూఢిల్లీ: వన్డే ప్రపంచకప్ ఫైనల్ పిచ్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) యావరేజ్ రేటింగ్ ఇచ్చింది. అహ్మదాబాద్ వేదికగా గత నెల 19న భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన వరల్డ్‌కప్ ఫైనల్లో కంగారూలు విజేతగా నిలిచి ఆరోసారి కప్పు కైవసం చేసుకోగా.. ఆ మ్యాచ్ జరిగిన పిచ్‌ను ఐసీసీ యావరేజ్‌గా ప్రకటించింది. ఫైనల్ ఆడిన గ్రౌండ్ ఔట్ ఫీల్డ్ చాలా బాగుందని పేర్కొన్న ఐసీసీ.. లీగ్‌దశలో భారత్ ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల పిచ్‌లను కూడా యావరేజ్‌గానే ప్రకటించింది. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన సెమీఫైనల్‌కు వినియోగించిన వాంఖడే పిచ్‌కు ఐసీసీ 'గుడ్'రేటింగ్ ఇచ్చింది.

సవిత సారథ్యంలో..

న్యూఢిల్లీ: ఈ నెల 15 నుంచి జరగనున్న ఐదు దేశాల మహిళ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు సవిత పునియా సారథ్యంలో బరిలోకి దిగనుంది. జర్మనీ, ఐర్లాండ్, స్పెయిన్, బెల్జియం పాల్గొంటున్న ఈ టోర్నీలో కోసం భారత హాకీ సమాఖ్య శుక్రవారం 22 మందితో కూడిన జట్టును ప్రకటించింది. స్పెయిన్ వేదికగా జరుగనున్న ఈ టోర్నీ కోసం అనుభవజ్ఞులు, యంగ్ ప్లేయర్లతో కూడిన జట్టును ఎంపిక చేసినట్లు భారత కోచ్ షాప్‌మన్ పేర్కొన్నాడు. వచ్చే ఏడాది ఒలింపిక్స్ జరగనున్న నేపథ్యంలో ప్రతీ సిరీస్ ముఖ్యమైందేనని కోచ్ అన్నాడు. గోల్ కీపర్ సవితతో పాటు జట్టులో వందన కటారియా, నిక్కీ, ఉదిత, గుర్జీత్, సలీమ, నేహా, నవ్‌నీత్, జ్యోతి, దీపిక, షర్మిల చోటు దక్కించుకున్నారు.

తెలంగాణ కెప్టెన్‌గా ఆర్యన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: చండీగఢ్ వేదికగా ఈ నెల 11 నుంచి మొదలవుతున్న 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగుతున్న తెలంగాణ ఇన్‌లైన్ హాకీ జట్టుకు ఆర్యన్ కర్రా కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని రాష్ట్ర ఇన్‌లైన్ హాకీ సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

జాక్‌పాట్ కిస్కా హై?

నేడు డబ్ల్యూపీఎల్ వేలం • 30 బెర్తుల కోసం 165 మంది పోటీ

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) వేలానికి రంగం సిద్ధమైంది.వచ్చే ఏడాది జరుగనున్న రెండో సీజన్ కోసం నేడు వేలం పాట నిర్వహించనున్నారు. మొత్తం 30 బెర్తుల కోసం 165 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. భారత క్రికెటర్లతో పాటు వివిధ దేశాల ప్లేయర్లు తమ కనీస ధరతో వేలంలోకి అడుగుపెట్టారు. శనివారం జరిగే వేలంలో ఎవరిని అదృష్టం వరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఐదు ఫ్రాంచైజీలు తమ తమ ప్రణాళికలకు అనుగుణంగా ప్లేయర్లను ఎంపిక చేసుకునే అవకాశముంది. ఎవరు ఏ జట్టులోకి అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ కోసం శనివారం వేలం పాట జరుగనుంది. రానున్న సీజన్ కోసం నిర్వహిస్తున్న ఈ వేలంలో ఐదు ఫ్రాంచైజీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. మల్లికా సాగర్ వేలాన్ని నిర్వహించనుంది. గత సీజన్ కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాలన్న ఉద్దేశంతో ఈసారి అన్ని ఫ్రాంచైజీలు తమదైన వ్యూహాలతో బరిలోకి దిగుతున్నాయి. అనుభవానికి తోడు యువ రక్తాన్ని జోడిస్తూ ఫలితాలు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

బెర్తులు 30, ప్లేయర్లు 165:

డబ్ల్యూపీఎల్ వేలంలో 30 బెర్తుల కోసం 165 మంది ప్లేయర్లు పోటీపడుతున్నారు. ఇందులో 104 మంది భారతీయులు ఉండగా, 61మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. 56 మంది క్యాప్‌డ్ ప్లేయర్లు కాగా, 109 మంది అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు జాబితాలో ఉన్నారు. ఏ జట్టులోనైనా 18 మందికి మించకుండా ప్లేయర్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

జాక్‌పాట్ ఎవరిదో?

డబ్ల్యూపీఎల్ వేలంలో అదృష్టం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచి ఆఖరి స్థానంతో లీగ్‌ను ముగించిన గుజరాత్ జెయింట్స్ అందరికంటే ఎక్కువగా 10 బెర్తుల కోసం పోటీపడనుంది. వెస్టిండీస్ స్టార్ దియోంద్ర డాటిన్, ఆస్ట్రేలియా క్రికెటర్ కిమ్ గార్త్ రూ.50 లక్షల కనీస ధరతో వేలంలోకి ప్రవేశిస్తున్నారు. ఆసీస్ ఆల్‌రౌండర్లు అన్నాబెల్ సదర్లాండ్, జార్జియా వేర్‌హామ్, శబ్నమ్ ఇస్మాయిల్, అమీ జోన్స్..రూ.40 లక్షల బ్రాకెట్‌లో ఉన్నారు. భారత వెటరన్ క్రికెటర్ వేదాకృష్ణ మూర్తి, పూనమ్ రౌత్, సుష్మావర్మ, ఏక్తాబిస్ట్, గౌహర్ సుల్తానా, మోనా మెశ్రమ్, ఎరిన్ బర్న్స్, సోఫీ, డానీ వ్యాట్, టామీ బ్యుమౌంట్, చమరీ ఆటపట్టు, నాడైన్ డీ క్లెర్క్..రూ.30 లక్షల విభాగంలో ఉన్నారు. గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచిన గుజరాత్ జెయింట్స్ ఈసారి పక్కా ప్రణాళికతో బరిలోకి దిగుతున్నది. 10 బెర్తుల కోసం గుజరాత్ 5.95 కోట్లు ఖర్చుపెట్టనుంది. నిరుటి సీజన్‌లో బేత్ మూనీ ఆదిలోనే గాయంతో వైదొలుగడంతో స్నేహ్ రానా గుజరాత్ కెప్టెన్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఆరు ఓటములతో నాలుగో స్థానంలో నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఈసారి తమ జట్టు కూర్పునకు మార్పులు చేసుకునే అవకాశముంది. డబ్ల్యూపీఎల్ తొలి సీజన్ చాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ భారీ మార్పులకు పోకుండా యువ క్రికెటర్లపై దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఫ్రాంచైజీల వివరాలు

ముంబై ఇండియన్స్	ఖాళీలు: 5	బడ్జెట్: 2.1 కోట్లు
ఢిల్లీ క్యాపిటల్స్	ఖాళీలు: 3	బడ్జెట్: 2.25 కోట్లు
యూపీ వారియర్స్	ఖాళీలు: 5	బడ్జెట్: 4.00 కోట్లు
ఆర్‌సీబీ	ఖాళీలు: 7	బడ్జెట్: 3.35 కోట్లు
గుజరాత్ జెయింట్స్	ఖాళీలు: 10	బడ్జెట్: 5.95 కోట్లు

భారత్ X ఇంగ్లండ్

నేడు మహిళల రెండో టీ20

రాత్రి 7 నుంచి..

ముంబై: తొలి పోరులో ఇంగ్లండ్ చేతిలో పరాజయం పాలైన భారత మహిళల క్రికెట్ జట్టు.. శనివారం రెండో టీ20 బరిలో దిగనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే ఇంగ్లిష్ జట్టు ఆధిక్యం దక్కించుకోగా.. సిరీస్ సమం చేయాలని హర్మన్‌ప్రీత్ బృందం తహతహలాడుతున్నది. గత మ్యాచ్‌లో బౌలింగ్, ఫీల్డింగ్‌లో తప్పిదాలతో పరాజయం వైపు నిలిచిన టీమ్‌ఇండియా.. వాటిని సరిదిద్దుకొని ముందుకు సాగాలని చూస్తుంటే.. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ దక్కించుకోవాలని ఇంగ్లండ్ భావిస్తున్నది. కొత్తగా జట్టులోకి వచ్చిన స్పిన్నర్లు మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తుండగా.. సీనియర్ బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడాల్సిన అవసరం ఉంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, దీప్తి శర్మ సమిష్టిగా సత్తాచాటితేనే జోరు మీదున్న ఇంగ్లండ్‌ను అడ్డుకోగలం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.